సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



ఈకేవైసీ పాట్లు

ఈకేవైసీ అప్‌డేట్‌కు రేషన్ డీలర్ల వద్ద ఉన్న ఈ పాస్ యంత్రాల్లో వేలిముద్రలు పడక పలువురు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. 8లో



భద్రాద్రిలో బీఆర్‌ఎస్‌దే గెలుపు

రాముడు కొలువై ఉన్న భద్రాచలం నియోజకవర్గంలో ఈసారి గులాబీ జెండానే ఎగురుతుందని ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 23°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఒకటి రెండు చోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



దాతలకు రశీదు అందజేస్తున్న ఈఓ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవస్థానంలో జరిగిన మరో కార్యక్రమంలో చిట్టవలసకు చెందిన రామారావు శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.2 లక్షల విరాళాన్ని ఈఓ రమాదేవికి అందజేయగా ఆమె దాతలను ఘనంగా సత్కరించారు.

ఆత్మలింగేశ్వరాలయాన్ని సందర్శించిన మెజిస్ట్రేట్



వెండి నాగాభరణం అందజేస్తున్న మెజిస్ట్రేట్

పాల్వంచ : పట్టణంలోని శ్రీ ఆత్మలింగేశ్వరాలయాన్ని సోమవారం వరంగల్ జిల్లా కోర్టు మెజిస్ట్రేట్ మండా వెంకటేశ్వరరావు, శిరీష దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 1.200 కేజీల వెండితో తయారు చేసిన నాగాభరణాన్ని అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు, పూజారి జితేందర్ శర్మ, కమిటీ సభ్యులు మెజిస్ట్రేట్ దంపతులను సన్మానించారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను బుధవారం ఉదయం 10 గంటల నుంచి జెడ్పీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సీఈఓ ఎం.విద్యాలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆయిల్ రిఫైనరీ పరిశ్రమ నిర్మించాలి



మాట్లాడుతున్న జోగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: వేలాది ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తూ, ఇక్కడే పామాయిల్ ఫ్యాక్టరీలు ఉండగా సాగు ఊసే లేని సిద్దిపేటలో ఆయిల్ రిఫైనరీ పరిశ్రమ ఏర్పాటు చేయాలనే నిర్ణయం సరైంది కాదని రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని నారంవారిగూడెంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. దమ్మపేట మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీ వద్దే రిఫైనరీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. అశ్వారావుపేటలో ఆయిల్ పామ్ పరిశోధనా కేంద్రాన్ని, పామాయిల్ గానుగ యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఫ్యాక్టరీలకు రైతులు తరలిస్తున్న గెలల్లో తరుగు పేరుతో ఐదు టన్నులకు 50 కేజీలు తొలగించే విధానాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కె. పుల్లయ్య, సభ్యులు తుంబూరు మహేశ్వరరెడ్డి, దారా తాతారావు, చీకటి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐఏ దాడులు గర్హనీయం : పోటు

ఖమ్మంమయూరిసెంటర్: రెండు తెలుగు రాష్ట్రాల్లో పౌర, ప్రజాస్వామిక హక్కుల కోసం పనిచేస్తున్న వారి ఇళ్లపై ఎన్‌ఐఏ అధికారులు దాడులు గర్హనీయమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎల్‌సీ నాయకుడు శ్రీమన్నారాయణ సహా మహిళా కార్యకర్తల ఇళ్లలో సోదాలు చేస్తూ భయానిక వాతావరణం కల్పిస్తున్నారని ఆరోపించారు. ఫాసిజానికి వ్యతిరేకంగా, ప్రజల హక్కుల కోసం మాట్లాడడాన్ని నేరంగా పరిగణిస్తున్నారని తెలిపారు. మాట, పాట, రాతపై మోదీ నిషేధాన్నివిధించి భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని విమర్శించారు.

ఒకటితోనే సరి !

అడ్రస్ లేని ఆర్టీసీ బంకులు..
- జిల్లాలో ఏడుచోట్ల అనువైన స్థలాల గుర్తింపు
- కొత్తగూడెంలో మాత్రమే ఏర్పాటు
- పెట్రోల్ బంక్‌తో పెరిగిన ఆదాయం



కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ పెంట్రోల్ బంకు

చుంచుపల్లి : తీవ్ర నష్టాల బారి నుంచి బయటపడేందుకు ఆర్టీసీ స్థలాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. సంస్థ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆర్టీసీని ప్రగతిబాట పట్టించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్లు, వాటి పరిసరాల్లోని ఖాళీ స్థలాల్లో హిందుస్తాన్ పెట్రోలియం కంపెనీ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలతో రాష్ట్రంలోని 46 చోట్ల పెట్రోల్ బంకులు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జిల్లాలో కొత్తగూడెం, బూర్గంపాడు, చర్ల, ఇల్లెందు, చండ్రుగొండ, మణుగూరు, వెంకటాపురంలో బంకుల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. ఆర్టీసీ స్థలాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటుతో దాని ద్వారా వచ్చే లీజు ఆదాయ వనరులతో పాటు ఇంధన సంస్థలు కొంతమేర కమీషన్‌ను ఆర్టీసీకి చెల్లిస్తాయి. ఈ ప్రక్రియలో మొదట జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో పెట్రోల్ బంక్‌కు ప్రాధాన్యత కల్పించారు. కొత్తగూడెంలో బంక్ అందుబాటులోకి తేవడంతో వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మిగతా ఆరు చోట్ల కూడా స్థలాలను గుర్తించిన ఆర్టీసీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు. అయితే ఇందులో మణుగూరు, బూర్గంపాడు ఇంధన వ్యాపారానికి అనుకూలంగా లేవని గుర్తించిన ఉన్నతాధికారులు.. కొత్తగా దమ్మపేటలో బంక్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పెట్రోల్ బంకుల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు రావాల్సి ఉంది. ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నా బంకుల ఏర్పాటులో ఎలాంటి పరోగతి కనిపించడం లేదు.

స్థలాలను సద్వినియోగం చేసేలా..

రోజువారీ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా ఆక్యుపెన్సీ రేషియోతో పాటు ఆదాయం పెంచుకుంటున్న ఆర్టీసీ.. మరింతగా ఆదాయం పెంచుకునేందుకు వివిధ మార్గాలను అన్వేషిస్తోంది. ఈ క్రమంలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం డిపోల పరిధిలో ప్రధాన రహదారుల పక్కనే ఆర్టీసీకి స్థలాలు ఉన్నాయి. డిపోల పక్కన ఏర్పాటు చేయబోయే బంకులను సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించారు. సొంతంగా పెట్రోల్ బంకుల నిర్వహణ చేపడితే స్థలాలకు ఆయా చమురు సంస్థల నుంచి లీజుతో పాటు లీటర్ పెట్రోల్‌పై రూ.2.83, డీజిల్‌కు రూ.1.89 పైసల చొప్పున కంపెనీలు ఇచ్చే కమీషన్ కూడా ఆర్టీసీకే సమకూరుతుంది. జిల్లాలోని మూడు డిపోల పరిధిలో ఆర్టీసీకి అత్యంత విలువైన స్థలాలు ఉన్నాయి. కొత్తగూడెం పాతబస్ డిపో ఏరియాలో 2.50 ఎకరాలు, పాల్వంచలో 1.50 ఎకరాలు, చండ్రుగొండలో సుమారు ఎకరం, భద్రాచలంలో 6 ఎకరాలు, ఇల్లెందులో 6 ఎకరాలు, బూర్గంపాడులో 2.50 ఎకరాలు, మణుగూరులో 8 ఎకరాలు, అశ్వాపురంలో 2 ఎకరాల చొప్పున ఆర్టీసీకి స్థలాలున్నాయి. వీటితో పాటు చర్ల, వెంకటాపురంలో కూడా అనువైన స్థలాలే ఉన్నాయి. వీటి పరిధిలో బంకు ఏర్పాటుకు అవసరమైన 1000 గజాల స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు పంపారు. జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఒక్క కొత్తగూడెంలో మాత్రమే ప్రారంభించారు. మిగిలిన చోట్ల కూడా ఏర్పాటు చేస్తే సంస్థకు గణనీయమైన ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి.

ప్రక్రియ నడుస్తోంది



ఆర్టీసీ స్థలాల్లో సంస్థ ఇప్పటికే పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తోంది. దీని వల్ల లీజు, కమీషన్ పద్ధతుల్లో సంస్థకు కొంత ఆదాయం సమకూరుతుంది. జిల్లాలో మొదట ఏడు చోట్ల ఆర్టీసీ బంకుల ఏర్పాటుకు స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు పంపాం. తొలి ప్రాధాన్యతగా కొత్తగూడెం డిపో పరిధిలో ఇటీవలే పెట్రోల్ బంకును ప్రారంభించాం. మిగిలిన చోట్ల అనుకూలమైన వాటికి ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ఇందుకోసం ప్రాసెస్ నడుస్తోంది.

– భవానీప్రసాద్, డిప్యూటీ ఆర్‌ఎం(మెయింటెనెన్స్)

అహింసతోనే విజయం సాధించారు..

గాంధీకి ఘనంగా నివాళులర్పించిన కలెక్టర్



గాంధీ జయంతి వేడుకలో కలెక్టర్ ప్రియాంక ఆల, అదనపు కలెక్టర్లు, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకురావడంలో జాతిపిత మహాత్మాగాంధీ అహింసా సిద్ధాంతాన్ని పాటించి విజయం సాధించారని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. గాంధీ జయంతి వేడుకలను సోమవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. మొదట బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహాత్ముడు ఏది చెప్పారో దాన్నే ఆచరించారని అన్నారు. అహింసా సిద్ధాంతాన్ని నమ్మి ప్రపంచ దేశాల మద్దతు పొందారని తెలిపారు. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని చాటారని, గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని చెప్పారని అన్నారు. అంటరానితనం నిర్మూలనకు కృషి చేశారని చెప్పారు. గాంధీజీ కన్న కలలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాకారం చేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

మూడు రోజుల్లో క్రీడా సామగ్రి పంపిణీ చేయాలి

మూడు రోజుల్లో క్రీడా మెటీరియల్, టీ షర్టుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రియాంక అల ఎంపీడీఓలను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పంపిణీ ప్రక్రియపై సోమవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా 746 క్రీడా ప్రాంగణాల్లో సామగ్రి పంపిణీకి షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. ఆయా ప్రాంగణాలలో ఆటలు ఆడుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టాలన్నారు. సామగ్రి పంపిణీ పండుగ వాతావరణంలో జరగాలని, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు పి రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్, కలెక్టరేట్ ఏఓ గన్యా, జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పెండింగ్‌పై అసంతృప్తి..

మీ సేవ, ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పట్ల కలెక్టర్ ప్రియాంక ఆల అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్ నుంచి సోమవారం జిల్లాలోని తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఆయా మండలాల్లో జీఓ 58, 59, 76 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అసంపూర్తిగా ఉన్న పనులను బుధవారం నాటికి నివేదిక అందజేయాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలో వేడుకలు

కొత్తగూడెంఅర్బన్: గాంధీ జయంతి వేడుకలు ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వినీత్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. శాంతి, అహింస అనే ఆయుధాలతో బ్రిటిష్ వారిని తరిమి కొట్టారని అన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తికి స్వాతంత్ర్యానికి ముందు అనేక అవమానాలు ఎదురైనా వాటన్నింటినీ అధిగమించి మహాశక్తిలా మారారని కొనియాడారు. దేశం గర్వించదగిన మహనీయుల్లో గాంధీ ముఖ్యులని చెప్పారు. మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని, తుప్పుపట్టిన సిద్ధాంతాలతో అమాయక ఆదివాసీలను ఇబ్బందులకు గురిచేయవద్దని, గాంధీజీని స్ఫూర్తిగా తీసుకుని సత్యం, శాంతి, అహింసా మార్గాల్లో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ టి.సాయిమనోహర్, చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్, డీసీఆర్బీ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రాజువర్మ, ఆర్‌ఐలు సుధాకర్, కృష్ణారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లైట్‌హౌస్ పంచాయతీగా ఇరవెండి



కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ రేవతి తదితరులు

ప్రకటించిన స్వచ్ఛభారత్ మిషన్ అధికారులు

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం సంకల్పించిన లక్ష్యాలను ఐటీసీ సహకారంతో పూర్తిచేసుకుని లైట్‌హౌస్ గ్రామపంచాయతీగా ఇరవెండి నిలిచిందని స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కన్సల్టెంట్ రేవతి మాణిక్యం, గ్రామ సర్పంచ్ కొర్సా లక్ష్మి ప్రకటించారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం ఇరవెండిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు పంచాయతీలు లైట్‌హౌస్‌గా నిలవగా అందులో ఇరవెండి ఒకటని తెలిపారు. గ్రామంలోని 446 ఇళ్లలో కేంద్రం నిర్దేశించిన ఐదు అంశాలలో పూర్తిస్థాయి లక్ష్యాలు సాధించామని చెప్పారు. అన్ని ఇళ్లకు మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా మార్చామని, తడి, పొడి చెత్త సేకరించి ఘన వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత నిర్మించామని, డ్రెయినేజీల నుంచి వచ్చే మురుగునీరు భూమిలో ఇంకేలా కాల్వల చివరన మెగా సోక్‌పిట్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. విజువల్ క్లీన్‌నెస్ కోసం రోడ్లు, బస్‌షెల్టర్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రతిరోజూ శుభ్రం చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ ఐదు అంశాలను సమర్థంగా నిర్వహిస్తున్నందుకు గాను ఇరవెండిని లైట్‌హౌస్ గ్రామపంచాయతీగా ప్రకటించారని తెలిపారు. ఇందుకు సహకరించినందుకు ఐటీసీ పీఎస్‌పీడీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్ చెంగలరావు, వాష్ఐ రీజనల్ మేనేజర్ జయప్రకాశ్, ఎంపీఓ సునీల్, ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ వెంకట్, డీఆర్‌డీఓ అంబుడ్స్‌మెన్, గ్రామపంచాయతీ కార్యదర్శి దివ్య, స్థానిక పెద్దలు తాళ్లూరి రాధాకృష్ణ, వల్లూరిపల్లి వంశీకృష్ణ, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఖైదీల్లో పరివర్తన రావాలి

జిల్లా జడ్జి వసంత్ పాటిల్



మాట్లాడుతున్న జడ్జి వసంత్ పాటిల్

భద్రాచలంటౌన్: ప్రతి ఒక్కరూ క్షణికావేశంలో తప్పులు చేయడం సహజమని, అనవరంగా పొరపాట్లు చేసి జైలు జీవితం అనుభవించిన ఖైదీలు పరివర్తన చెంది విడుదలయ్యాక మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకోవాలని జిల్లా జడ్జి వసంత్ పాటిల్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా భద్రాచలం సబ్ జైలులో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత జైలు ఆవరణలో సోమవారం నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. సత్యం, అహింస సూత్రాలను పాటించాలని, ఎవరు ప్రేరేపించినా తొందరపడి తప్పు చేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఖైదీలకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఖైదీలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, సబ్ జైల్ అధికారి ఉపేందర్, దుర్గాబాయి, డాక్టర్ చైతన్య, రామారావు, వెంకటేశ్వర్లు, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

- ఆలయ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- సన్మాన కార్యక్రమంలో ఈఓ రమాదేవి



దాతలకు స్వామివారి జ్ఞాపిక అందిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఈఓ రమాదేవి అన్నారు. ఇప్పటివరకు సహకరించిన దాతలను స్థానిక టీటీడీ సత్రంలో సోమవారం ఘనంగా సత్కరించారు. దేవస్థానానికి బంగారు, వెండి ఆభరణాలు, వస్త్రాలు, వస్తువులు అందించిన వారితో పాటు, అన్నదానం, వసతి వంటి వాటికి రూ.లక్షకు పైగా విరాళాలు సమర్పించిన దాతలను కార్యక్రమానికి ఆహ్వానించగా, 250 మందికి పైగా దాతలు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి ఆలయ అభివృద్ధికి దాతలు మరింత మంది ముందుకు రావాలని కోరారు. దాతల సహకారంతో ఇప్పటికే అనేక నిర్మాణాలు జరిగాయన్నారు. అనంతరం దాతలకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందించారు. కార్యక్రమానికి వచ్చిన దాతలను వేద పండితులు ఆశీర్వదించగా, స్వామివారి దర్శనం, వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. అనంతరం రామదాసు కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్యం భక్తులను అలరించింది.

దాతలను ప్రొత్సహించేలా ఉంది



దేవస్థానం అధికారులు నిర్వహించిన ఈ కార్యక్రమం దాతలను ప్రొత్సహించేలా ఉంది. గతంలో నేను రూ.1.50 లక్షలు నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళంగా అందించా. ఆలయ అధికారుల ఆహ్వానం మేరకు కుటుంబ సమేతంగా వచ్చాము. ఇక్కడ ఏర్పాట్లు బాగున్నాయి.

– వసతకుమార్ రెడ్డి, హైదరాబాద్

ప్రతి ఏటా నిర్వహించాలి



భద్రాచలం రామాలయంలో ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమం నిర్వహించాలి. మా కుటుంబమంతా రామ భక్తులం. రామయ్య సేవకు ప్రతీ సంవత్సరం భద్రాచలం వస్తుంటా. రామయ్య ఆలయ అభివృద్ధిలో భాగస్వాములం అయినందుకు చాలా సంతోషంగా ఉంది.

పి. పద్మావతి, దాత

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలి




సమీక్షకు హాజరైన వద్దిరాజు, ఎమ్మెల్యే వనమా

పాల్వంచ : సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నివాసంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గడపగడపకూ వెళ్లి ప్రతీ ఓటర్‌ను కలవాలని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ త్వరలో వచ్చే అవకాశం ఉందని, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు అందరినీ కలుపుకుని పోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, రైతుబంధు సమితి నియోజకవర్గ అధ్యక్షుడు కిలారు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు వనమా రాఘవేందర్ రావు, ఎం.ఎ.రజాక్, తొగరు రాజశేఖర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి కొత్త జిల్లా

- సత్తుపల్లి కేంద్రంగా ఏర్పాటుకు ఏళ్లుగా డిమాండ్
- గతంలో జేఏసీ ఆధ్వర్యాన ఆందోళనలు
- అశ్వారావుపేటతో కలిపి ఏర్పాటుచేస్తే దూరాభారం తగ్గుతుందని వెల్లడి
- తాజా పర్యటనలో మంత్రి కేటీఆర్ ప్రస్తావన
- ఈసారి ఎన్నికల నినాదంగా మారే అవకాశం



సత్తుపల్లి: రాష్ట్రంలోని మరెక్కడా లేనంతగా ఆయిల్ పామ్ తోటలు.. రెండు పామాయిల్ ఫ్యాక్టరీలు.. కొబ్బరి తదితర ఉద్యాన పంటలు.. వందల ఎకరాల్లో మామిడి నర్సరీలు.. అపారమైన బొగ్గు నిక్షేపాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. గతంలో ఒకే నియోజకవర్గంగా ఉన్న ఇవి పునర్విభజన అనంతరం రెండుగా విడిపోయాయి. అశ్వారావుపేట నుంచి కొత్తగూడేనికి, సత్తుపల్లి నుంచి ఖమ్మంకు రావాలంటే దూరాభారమని ప్రజలు భావిస్తారు. ఈ నేపథ్యాన రెండు నియోజకవర్గాలను కలుపుతూ సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది. కానీ ప్రభుత్వం 33 జిల్లాల ఏర్పాటు తర్వాత మళ్లీ ఊసెత్తకపోవడంతో అంతా సద్దుమణిగింది. అయితే, ఇటీవల సత్తుపల్లి సభకు వచ్చిన మంత్రి కేటీఆర్.. వెంకటవీరయ్యను 60వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే జిల్లా డిమాండ్‌ను నెరవేర్చుకునేలా సీఎం కేసీఆర్ మనసు గెలుచుకోవచ్చని చెప్పడంతో మళ్లీ సత్తుపల్లి జిల్లా అంశం తెరపైకి వచ్చింది.

గత ఉద్యమంలో కీలకంగా 'సండ్ర'

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల సత్తుపల్లి పర్యటనలో ఎమ్మెల్యేగా సండ్ర వెంకటవీరయ్యను 60 వేల నుంచి 70వేల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే సత్తుపల్లి జిల్లా అంశాన్ని సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని చెప్పడంతో చర్చ మొదలైంది. గతంలో జిల్లా సాధనకు ఉవ్వెత్తున ఉద్యమం సాగగా.. అందులో కీలకంగా పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య ఇప్పుడు మంత్రి కేటీఆర్‌తో ప్రకటన చేయించడం విశేషం. కాగా, కాంగ్రెస్ నేతలు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, కొండూరు సుధాకర్, కోటూరి మానవతారాయ్ తదితరులు సైతం జిల్లా ఏర్పాటు ఉద్యమానికి మద్దతు ఇస్తామని ఇప్పటికే ప్రకటించారు. అంతేకాకుండా తాజాగా సత్తుపల్లికి చెందిన న్యాయవాదులు జిల్లా ఏర్పాటుకు డిమాండ్ చేయటం.. ఇటీవల పర్యటనలో కేటీఆర్ ప్రస్తావించడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ములుగు జిల్లా చేయడంతో..

జిల్లాల పునర్విభజన సమయాన సత్తుపల్లిని జిల్లాగా ఏర్పాటు చేయాలంటూ ఉద్యమం చేపట్టారు. అయితే, 32 జిల్లాల ఏర్పాటుతో ఈ ప్రక్రియ ముగిసిందని, మళ్లీ ఎక్కడైనా జిల్లా ఏర్పాటు చేస్తే సత్తుపల్లి అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని జిల్లా పునర్విభజన కమిటీ అప్పట్లో హామీ ఇచ్చింది. ఇక, అప్పటి అధికార పార్టీ నేతలు సత్తుపల్లి జిల్లా ప్రాధాన్యత, స్థానికుల డిమాండ్‌ను సీఎం కేసీఆర్‌కు వివరించడంలో వెనుకబడడంతో ఫలితం దక్కలేదు. కానీ 2018 ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్ ములుగు సభలో టీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే ములుగు జిల్లా చేస్తామని హామీ ఇవ్వగా, సత్తుపల్లి ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు కేసీఆర్ దృష్టికి జిల్లా అంశాన్ని తీసుకురావాలని యత్నించినా సాధ్యం కాలేదు. దీంతో సీఎం ఎలాంటి హామీ ఇవ్వలేదు. అయితే, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ములుగుతో పాటు నారాయణపేటను కూడా జిల్లాలుగా చేసినప్పటికీ సత్తుపల్లి జిల్లాను సాధించడంలో నేతలు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

129 రోజుల పాటు దీక్షలు

సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలను కలిపి సత్తుపల్లి జిల్లా చేయాలని రాజకీయ జేఏసీ ఆధ్వర్యాన 2016 అక్టోబర్ 29 నుంచి 129 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. రెండుసార్లు సత్తుపల్లి బంద్ కూడా చేపట్టగా వంటావార్పు, రాస్తారోకో తదితర ఆందోళనలు జరిగాయి. అలాగే, 175 గ్రామపంచాయతీల్లో తీర్మానాలు కూడా చేశారు. రెండు నియోజకవర్గాల్లోని పది మండలాలను కలిపి సత్తుపల్లి కేంద్రంగా జిల్లా చేయాలనే డిమాండ్‌తో ఉధృతంగా ఆందోళనలు చేపట్టారు. రెండు నియోజకవర్గాల్లోని పది మండలాలను విడదీసి గంగారం, లంకపల్లి, మొద్దులగూడెం, చెన్నూరు, కుర్నవల్లి, పట్వారిగూడెం, వినాయకపురం కేంద్రాలుగా కొత్త మండలాలు ఏర్పాటుచేసి 17 మండలాలతో జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విస్తీర్ణం 5.47 లక్షల చదరపు మీటర్ల పైచిలుకు ఉండడం, అశ్వారావుపేట నుంచి కొత్తగూడెంకు.. సత్తుపల్లి నుంచి ఖమ్మంకు వెళ్లాలంటే 80 కి.మీ. నుంచి 120 కి.మీ. ఉండడంతో దూరాభారం తగ్గడానికి జిల్లా ఏర్పాటే మార్గమని ప్రతిపాదించారు. కాగా, జిల్లా సాధన కోసం జేఏసీ ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్రను తల్లాడలో అడ్డుకుని నమోదు చేసిన కేసును గత నెల 13న జిల్లా కోర్టు కొట్టివేసింది.

క్లుప్తంగా

కేసీఆర్ పాలనతో విసిగిపోయారు..


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీ రంగాకిరణ్ పేర్కొన్నారు. పాలమూరు బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పసుపు బోర్డు, జాతీయ గిరిజన యూనివర్సిటీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెంలో నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ఈసారి ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే పట్టం కడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చింతల చెరువు శ్రీనివాసరావు, భూక్య రాజేష్ నాయక్, జల్లారపు శ్రీనివాస్, కటికల రంజిత్, సాయిరాం, విజయ్, భీముడు, కుమార్, రాహుల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్ త్రిషను కలిసిన జిమ్ కోచ్


త్రిషతో జిమ్ కోచ్ వెంకటరామిరెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ కోచ్ గొంగడి వెంకటరామిరెడ్డి అండర్–19 మహిళా క్రికెటర్ త్రిషను సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ ఈస్ట్ మారేడుపల్లిలోని త్రిష నివాసంలో కలిసిన ఆయన జరగబోయే క్రికెట్ మ్యాచ్‌లలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని సూచించారు.

ఎఫ్‌బీఓ, గిరిజనుల నడుమ వాగ్వాదం

అశ్వాపురం: అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ బీట్ పరిధిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీదేవికి, అశ్వాపురం మండలం కుర్నాపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన కొందరు గిరిజనులకు సోమవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. గిరిజనులు ఇటీవల మొక్కజొన్న సాగుకు విత్తనాలు చల్లగా, ఫారెస్ట్ ప్లాంటేషన్‌లో మొక్కజొన్న సాగును తొలగించేందుకు ఎఫ్‌బీఓ ట్రాక్టర్ తీసుకుని వెళ్లారు. ఈ క్రమంలో మొండికుంట, కృష్ణసాగర్ గ్రామాల మధ్య ఎఫ్‌బీఓకు, గిరిజనులకు వాగ్వాదం జరిగింది. గిరిజనులు ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి చేసినట్టు సమాచారం. ఈ ఘటనలో ఎఫ్‌బీఓకు స్వల్ప గాయాలైనట్టు తెలిసింది. ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు తనపై కూడా గిరిజనులు దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఫ్‌బీఓ తెలిపారు.

ఐఆర్ 30 శాతం ఇవ్వాల్సిందే..

కొత్తగూడెంఅర్బన్/టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ఐదు శాతం ప్రకటించడం సరికాదని, కనీసం 30 శాతమైనా ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పీఆర్సీ ఏర్పాటు సందర్భంగా కేవలం ఐదు శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించడాన్ని వారు ఖండించారు. ఇకనైనా 30శాతానికి పెంచాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని తెలిపారు. కాగా, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదు శాతం ఐఆర్ ఇవ్వడం ద్వారా అవమానించిందని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్‌నాయక్ ఇంకో ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం 30 శాతం ఐఆర్ ఇవ్వాల్సింది పోయి ఐదు శాతం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా జీఓను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి

ఖమ్మం సహకారనగర్: సాధారణ ఉపాధ్యాయులతో పాటే గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలనే డిమాండ్‌తో ఈనెల 4న హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి చేపడుతున్నట్లు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గిరిజన పాఠశాలల్లో బదిలీలు, పదోన్నతులు లేక విద్యావ్యవస్థ కుంటుపడినందున నూతన పోస్టులు మంజూరు చేయడమే కాక మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు, ఎస్జీటీల బదిలీలు పూర్తి చేయాలని రవి డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సంఘం బాధ్యులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13.026

ఈ–కేవైసీ పాట్లు


వేలిముద్ర పడకపోవడంతో పాల్వంచ మీ సేవ కేంద్రానికి వచ్చిన లబ్ధిదారులు

రేషన్ దుకాణాల్లో వేలిముద్రల కోసం బారులు

- లబ్ధిదారులంతా అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వ నిర్దేశం
- జిల్లాలో 17 వేల మంది మృతి చెందినట్లు గుర్తింపు
- మృతుల పేర్లు తొలగించేందుకే ఈ ప్రక్రియ

పాల్వంచరూరల్: ఈ–కేవైసీ అప్‌డేట్ చేయించుకునేందుకు లబ్ధిదారులు రేషన్ షాపుల వద్ద బారులుదీరుతున్నారు. మృతి చెందిన వారి పేర్లు రేషన్ కార్డుల్లో తొలగించేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టింది. కార్డులో పేరున్న లబ్ధిదారులందరూ తప్పనిసరిగా ఈ పాస్ యంత్రం ద్వారా వేలిముద్రలు వేయాలని నిర్దేశించింది. రేషన్ డీలర్ల వద్ద ఉన్న ఈ పాస్ యంత్రం ద్వారా కేవైసీ అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించగా, వేలి ముద్రలు వేసేందుకు లబ్ధిదారులు క్యూ కడుతున్నారు. గత నెల 5వ తేదీ నుంచి రేషన్ దుకాణాల వద్ద ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

జిల్లాలో 2,74,523 రేషన్ కార్డులు

జిల్లాలో 443 రేషన్ దుకాణాలు ఉండగా 2,74,523 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు 18,801 ఉండగా, అన్నపూర్ణ కార్డులు 3 ఉన్నాయి. చనిపోయిన లబ్ధిదారులు 17వేల మంది ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. వీరితోపాటు మరో 20 వేల మంది లబ్ధిదారులు అందుబాటులో లేరని పేర్కొంటున్నారు. వీరిలో కొందరు రేషన్ కార్డులో పేర్లు ఉండి ప్రతినెలా రేషన్ తీసుకోకుండా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాలకు వెళ్లినవారు, యువతులు పెళ్లిళ్లు జరిగి అత్తవారింటికి వెళ్లినవారు, మగవారి పెళ్లిళ్లు జరిగి ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి వేరే కాపురం పెట్టినవారు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

వేలి ముద్రలు పడక...

రేషన్ దుకాణంలో ఈ పాస్ యంత్రంలో వేలిముద్రలు పడక జిల్లాలో అనేక మంది లబ్ధిదారులకు రేషన్ అందక అవస్థలు పడుతున్నారు. ఇలాంటి వారు జిల్లాలో 8శాతం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వేలిముద్రలు పడని లబ్ధిదారులకు కంటి చూపు(ఐరిస్) ఆధారంగా గుర్తించి రేషన్‌ను పంపిణీ చేస్తున్నారు. ఐరిస్ ద్వారా అప్‌డేట్ చేసుకునేందుకు లబ్ధిదారులు ఈ సేవా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. కాగా వేలు ముద్రలు పడని లబ్ధిదారులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఐరిస్ ద్వారా గుర్తించాలని బాధితులు కోరుతున్నారు.

సర్వర్ పనిచేయక..

రేషన్ ఈ–కేవైసీ పునరుద్ధరణ కోసం లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లో బారులు తీరుతుండగా, సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. కొందరు లబ్ధిదారులు వేకువ జాము నుంచే రేషన్ దుకాణాల వద్ద నిరీక్షిస్తున్న పరిస్థితి నెలకొంది. కాగా ఎప్పుడు రేషన్ తీసుకునే చోటనే కేవైసీని పూర్తి చేసుకోవాల్సిన అవసరం లేదని, అందుబాటులో ఉన్న ఏ రేషన్ దుకాణంలోనైనా వేలు ముద్రలు అప్‌డేట్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. కాగా పాల్వంచ మండలంలో కొందరు డీలర్లు కేవైసీకి లబ్ధిదారులు నుంచి చార్జిల పేరుతో అక్రమంగా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.


తోగ్గూడెంలో ఈ–కేవైసీ కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

చర్యలు తీసుకుంటాం

రేషన్ తీసుకునే లబ్ధిదారులంతా రేషన్ దుకాణంలో ఉన్న ఈ పాస్ యంత్రంలో వేలి ముద్రలువేసి ఈకేవైసీని పునరుద్ధరించుకోవాలి. ఇందుకోసం ప్రత్యేక గడువు ఏమీలేదు. ఈ కేవైసీ పునరుద్ధరణకు డీలర్లు ఎవరైనా డబ్బులు తీసుకుంటే మాకు ఫిర్యాదు చేయండి. చర్యలు తీసుకుంటాం.

– రుక్మిణీదేవి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

ఇళ్ల స్థలాలు రాలేదని..

సెల్ టవరెక్కి నిరసన తెలిపిన ఇద్దరు వ్యక్తులు


ఇంటి స్థలాల జాబితాలో పేరులేదని సెల్ టవరెక్కిన బాధితులు


బాధితులతో మాట్లాడుతున్న పొంగులేటి

సింగరేణి(కొత్తగూడెం): ధన్‌బాద్ పంచాయతీ రెండో వార్డు సభ్యుడు, మాయాబజార్‌కు చెందిన పిచ్చేటి శివకుమార్, దనసరి బన్ను తమకు ఇళ్ల స్థలాలు రాలేదని సోమవారం 5 ఇంక్‌లైన్‌లో సెల్ టవరెక్కి నిరసన తెలిపారు. మాయాబజార్ ప్రాంతంలో ఇళ్లు కోల్పోయే వారికి ఈ నెల 3న సింగరేణి ప్రధాన కార్యాలయం సమీపంలో సుమారు 347 మందికి 100 గజాల చొప్పున కొత్తగూడెం ఎమ్మెల్యే చేతుల మీదుగా స్థలాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆ జాబితాలో పేర్లు లేకపోవడంతో శివకుమార్, బన్ను మనస్తాపం చెంది సెల్‌టవర్ ఎక్కా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తల్లి దండ్రుల కాలం నుంచి సుమారు 60 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని తెలిపారు. వీకే–7ఓసీ విస్తరణలో భాగంగా ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయించి, వేరే చోట స్థలాలు ఇస్తామని సింగరేణి, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చెప్పారని తెలిపారు. సర్వే చేసిన జాబితాలో ఉన్న పేర్లు, పంపిణీ జాబితాలో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పేర్లు చేర్చారని, తమకు మాత్రం అన్యాయం చేశారని వాపోయారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేష్ అక్కడికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. దీంతో బాధితులు టవర్ దిగారు. అనంతరం పొంగులేటి ఫోన్ ద్వారా సమస్యను ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. కామేష్ మాట్లాడుతూ వీకే–7ఓసీ విస్తరణ బాధితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అధికార పార్టీ నాయకులు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. జాబితాలో కొందరు బాధితుల పేర్లు లేకుండా చేశారని, యూనియన్ నాయకులు, సొంత ఇళ్లు ఉన్న వారి పేర్లు అక్రమంగా చేర్చారని పేర్కొన్నారు. నేడు జరిగే పట్టాల పంపిణీని నిలిపివేసి, మళ్లీ సమగ్ర సర్వే చేయాలని డిమాండ్ చేశారు.

సెల్ టవరెక్కిన మరో నిర్వాసితుడు

ఇంటి స్థలం మంజూరు కాలేదని సోమవారం రాత్రి ఎస్ఆర్‌టీ కాలనీకి చెందిన యువకుడు రవితేజ కూడా రుద్రంపూర్‌లోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. ఓసీ విస్తరణ నిర్వాసితులకు పంపిణీ చేయనున్న ఇళ్ల స్థలాల జాబితాలో పేరు లేకపోవడంతో ఆర్కే స్వామి చిన్న కుమారుడు రవితేజ సెల్ టవరెక్కి సుమారు మూడు గంటలపాటు నిరసన వ్యక్తం చేశాడు. త్రీ టౌన్ సీఐ మురళి, డీటీ తిరుమల తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పారు. డాక్యుమెంట్లు సక్రమంగా ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి స్థలం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో యువకుడు సెల్‌టవర్ దిగాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న సరోజ

సుజాతనగర్: ఇంటి స్థలం వివాదం కారణంగా ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని నర్సింహసాగర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావత్ సరోజ, రామనాథం దంపతులు గ్రామంలోని స్థలంలో మూడేళ్ల క్రితం ఇంటిని నిర్మించుకున్నారు. ఆ ఇంటి స్థలం పంపకాల విషయంలో కొన్ని రోజులుగా రామనాథం, అతని సోదరుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గత నెల 30న అదే ఇంటి స్థలంలో బాత్రూం కట్టాలని సరోజ దంపతులు నిర్ణయించుకున్నారు. నిర్మాణానికి అడ్డుగా ఉన్న చెట్టు తొలగిస్తుండగా రామనాథం సోదరులు సరోజపై దాడికి పాల్పడ్డారు. దీంతో అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కూడా సరోజను తిట్టారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు వాహనంలో ఆమెను కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమేశ్వర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొడనంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం బస్టాండ్ నుంచి వెంకటాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. క్షతగ్రాతున్ని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదు

ఇల్లెందురూరల్: బీఆర్ఎస్ నాయకులు కొందరు తనను అసభ్య పదజాలంతో దూషిస్తూ, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ అదే పార్టీకి చెందిన అసమ్మతి నాయకుడు వాంకుడోత్ శ్రీనివాస్ సోమవారం కొమరారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో అభివృద్ధిపై తాను చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పే క్రమంలో తీవ్రస్థాయిలో చేసిన దూషణలు తనను మానసికంగా ఇబ్బందికి గురిచేశాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్సై గిరిధర్‌రెడ్డిని వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని, విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఐదుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌ను ధ్వంసం చేసిన ఘటనలో పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ కార్తీక్ కథనం ప్రకారం.. పెద్దమ్మగుడి వద్ద విజయదుర్గ కేటరింగ్ సప్లయిర్స్‌గా పనిచేస్తున్న జగన్నాథపురం గ్రామానికి చెందిన ధర్మసోత్తు వంశీ, నరేష్, సాయి, శ్రీను, మహేందర్ కర్రలతో ఫంక్షన్‌హాల్ అద్దాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఫంక్షన్‌హాల్ యజమాని నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గుండాల: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆళ్లపల్లి మండలం తిర్లాపురం గ్రామానికి చెందిన కుంజా నరేష్(30) నాలుగు రోజుల క్రితం కాచనపల్లి వెళుతుండగా కాచనపల్లి–అనంతోగు మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఖమ్మం తరలించగా, చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య


వంశీ (ఫైల్)

సుజాతనగర్: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మండలంలోని సీతంపేట బంజర గ్రామానికి చెందిన గుగులోత్ రమేష్, నీలా దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వంశీ(23) మైనింగ్ డిప్లొమా పూర్తి చేశాడు. పోలీస్ ఉద్యోగ పోటీ పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాడు. పరీక్ష అనంతరం కీ పేపర్ చెక్ చేసుకుని, తనకు 105 మార్కులు వస్తాయని, ఉద్యోగం వచ్చే అవకాశం ఉందంటూ ఇటీవలే తల్లిదండ్రులతో ఆనందం పంచుకున్నాడు. కాగా గత నెల 30న ఉన్నత చదువుల కోసం కొంత డబ్బు అడుగగ, వ్యవసాయ పెట్టుబడుల కారణంగా ఇప్పుడు ఇవ్వలేమని తల్లిదండ్రులు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది అదే రోజు పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని ఖమ్మం తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతి చెందాడు. ఉద్యోగం వచ్చే తరుణంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా మృతుడి కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు.

ఇండియా కూటమితో బీజేపీ వెన్నులో వణుకు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


రాజేశ్వరపురంలో కనకయ్యను పరామర్శిస్తున్న తమ్మినేని

నేలకొండపల్లి: కేంద్రంలోని మతోన్మాద ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఏకైక లక్ష్యంగా వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర సెక్యులర్ పార్టీలతో ఇండియా కూటమి ఏర్పడడంతో బీజేపీ వెన్నులో వణుకు మొదలైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని రాజేశ్వరపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ రాసాల కనకయ్యను సోమవారం పరామర్శించాక ఆయన మాట్లాడారు. బీజేపీ అరాచకం, అణిచివేత, మతోన్మాద పోకడలతో అనాగరిక పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. మణిపూర్ మారణకాండ నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తీసుకొచ్చారని తెలిపారు. ఇక రాష్ట్రంలో ప్రజలకు కేసీఆర్ ఇచ్చిన ఇచ్చిన హామీలను విస్మరించి మరోమారు మోసం చేసేందుకు కుట్ర పన్నారని చెప్పారు. రుణమాఫీ అమలుకాక రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కే.వీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, కట్టికోల వెంకన్న, చింతలపాటి భాస్కర్, మండదపు మురళి, యలమద్ది వెంకటేశ్వరరావు, యలమద్ది లెనిన్, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయ మాజీ చైర్మన్ మృతి

పాడె మోసిన ఎంపీ నామ నాగేశ్వరరావు


పాడె మోస్తున్న ఎంపీ నామ

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ మాజీ చైర్మన్ బోయినపల్లి వెంకటసుబ్బారావు(68) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఇటీవల గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ తదితరులు ఎర్రగుంటలో మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంపీ నామ పాడె మోస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. సంతాపం తెలిపివారిలో చంద్రుగొండ జెడ్పీటీసీ వెంకటరెడ్డి, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బోయినపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.23.75 కోట్లతో ఐసీయూ

- సర్వజన ఆస్పత్రి పరిధిలో పెరగనున్న మరో 50 పడకలు
- భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు


జిల్లా ప్రభుత్వాస్పత్రి

కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రి పరిధిలో ఐసీయూ(అత్యవసర చికిత్సా విభాగం) భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో అధికారులకు భవనం కోసం స్థల పరిశీలన చేస్తున్నారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద జిల్లా కేంద్రంలో 50 పడకల అత్యవసర విభాగం నిర్మించేందుకు గత జూన్ నెలలో రూ. 23.75 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.12.75 కోట్లతో భవన నిర్మాణం చేపట్టాలని, రూ.7.12 కోట్లు అత్యవసర విభాగంలో వెంటిలేటర్స్, ఇతర పరికరాలకు వెచ్చించాలని నిర్దేశించారు. మిగతా నిధులు, ఇతర అవసరాలకు వినియోగించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలమెంట్ కార్పొరేషన్ మూడు రకాల ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులు పంపించినట్లు సమాచారం. వారు ఆమోదిస్తే భవనం నిర్మాణానికి టెండర్లు పిలువనున్నారు.

నిర్మించేది ఎక్కడ..?

జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి కొత్తగూడెం ప్రధాన సెంటర్‌లో ఉంది. ఇందులో 280 పడకలు ఉన్నాయి. రామవరం మాతా శిశు సంరక్షణ కేంద్రం ఉండగా, ఇక్కడ వంద పడకలు ఉన్నాయి. వైద్య కళాశాల కేఎస్ఎం వద్ద ఉంది. ఈ నేపథ్యంలో అత్యవసర విభాగం ఎక్కడ నిర్మించాలనే విషయమై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒకవేళ అత్యవసర విభాగం భవనం కేఎస్ఎం వద్ద ఉన్న వైద్య కళాశాలలో నిర్మిస్తే, కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీంతో అత్యవసర విభాగంలో చికిత్స పొందే రోగులు అనేక ఇబ్బందులు పడతారు. రామవరంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో అత్యవసర విభాగం భవన నిర్మాణం చేపట్టినా దూరభారంతో ఇబ్బందులు తప్పవు. సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న పాత క్వార్టర్ల కూల్చి నిర్మిస్తే రోగులకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పుడే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కూడా చికిత్స అందించేందుకు అందుబాటులో ఉంటారని, నయమైన రోగులను ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించేందుకు వీలుగా ఉంటుందని, సకాలంలో వైద్య సేవలు అందుతాయని పలువురు పేర్కొంటున్నారు.

రాముడి సన్నిధిలో బీఆర్ఎస్‌దే గెలుపు

ఎమ్మెల్సీ తాతా మధు


రామాలయంలో ఎమ్మెల్సీ మధు, ఇతర నాయకులు

భద్రాచలం: రాముడు కొలువై ఉన్న భద్రాచలం నియోజకవర్గంలో ఈసారి గులాబీ జెండానే ఎగురుతుందని ఎమ్మెల్సీ తాతా మధు తెలిపారు. సోమవారం ఆయన శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భద్రాచలంలో కేటీఆర్ పర్యటన రద్దు కావడం, ఆ పర్యటనలో బందోబస్తుకు వచ్చిన మహిళా హెడ్ కానిస్టేబుల్ మృతి చెందడం బాధకరమని, ఆమెకు సంతాపం తెలిపారు. కాగా భద్రాచలంలో గత ఎన్నికల్లో ఇతర పార్టీలకు అవకాశం ఇచ్చినా జరిగిన అభివృద్ధి శూన్యమని అన్నారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. భద్రాచలం అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్‌కు ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని, తెల్లం వెంకట్రావ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ముఖ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం జరిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ ఇన్‌చార్జి మానె రామకృష్ణ, భద్రాచలం మండల అధ్యక్షుడు అరికెల తిరుపతిరావు, కార్యదర్శి కృష్ణమూర్తి, దుమ్ముగూడెం అధ్యక్షుడు అన్నెం సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి కణితి రాముడు, చర్ల మండల కార్యదర్శి పోలిన లంకారాజు, వెంకటాపురం మండల అధ్యక్షుడు గంప రాంబాబు, కార్యదర్శి పిల్లారి శెట్టి మురళి, వాజేడు మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సోమిరెడ్డి నరసింహారావు, దుమ్ముగూడెం, వెంకటాపురం, వాజేడు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీరుపై జర్నలిస్టుల ఆగ్రహం

విలేకర్ల సమావేశంలో ఓ పత్రికా విలేకరి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంపై.. తిరిగి మాట్లాడుతుండగా ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడిన తీరుపట్ల జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ప్రశ్నలకు సరైనరీతిలో జవాబులు చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై, పార్టీ నాయకులపై ఉందని పేర్కొన్నారు. దీంతో తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని మధు పేర్కొనడంతో అంతా సద్దుమణిగింది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- రూ.44 లక్షల వ్యయంతో పనులు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ తిరుమలేష్


వినాయకపురంలో బోరు పాయింట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ తిరుమలేష్

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, మిషన్ భగీరథకు ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ తిరుమలేష్ తెలిపారు. మండలంలోని నారాయణపురం గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ముందుగా వినాయకపురం గ్రామ సమీపంలో ఉన్న వైకుంఠధామం దగ్గర బోరు పాయింట్ ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం కింద సక్రమంగా తాగునీరు సరఫరా కానీ గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా బోర్లు, పైపులైన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కృషితో సీఎం కేసీఆర్ అశ్వారావుపేట నియోజకవర్గానికి రూ.5 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలో నెలకొని ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే రూ.44 లక్షలు కేటాయించారని, వినాయకపురంలో బోరు నిర్మించి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణపురం వరకు పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని వివరించారు. డీఈ సలీం, ఏఈ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు, పాడియం వెంకటేష్ పాల్గొన్నారు.